అటవీ అభివృద్ధి సంస్థను రద్దు చేయాలి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 5: పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తున్న అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ)ని రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంఘాల నాయకులు డీఆర్‌వో రవీంద్రనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 62,359.05 ఎకరాల్లో ఈ సంస్థ జామాయిల్, వెదురు, జీడిమామాడి, టేకు లాంటి పంటలను సాగు చేస్తూ అటవీ అభివృద్ధికి తిలోదకాలిచ్చి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో క్రాంతి, సామాజిక కార్యకర్త, జర్నలిస్టు, సోయం బాబురావు, మడివి రాంబాబు, తాటి రవి, తాండ్ర లక్ష్మణరావు పాల్గొన్నారు.

శాశ్వత పూజలకు రూ. 2లక్షలు

భద్రాచలం, ఫిబ్రవరి 5: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో నిర్వహించే శాశ్వత పూజలకు ఖమ్మం జిల్లా పెనుబల్లి వాస్తవ్యులు హరిసాయి మణికంఠ ఆగ్రో ట్రాక్టర్స్ వారు రూ. 2 లక్షలు ఆలయ అధికారి లింగాల సాయిబాబాకు సోమవారం అందజేశారు. తొలుత రామయ్యను దర్శించుని పూజలు చేశారు.

ఆక్రమణలు తొలగించాలి

సారపాక, ఫిబ్రవరి 5 : స్థానిక ఎన్‌హెచ్‌కి ఇరువైపులా డ్రైనేజీకి ముందు పుట్‌పాత్ ఏరియాల్లో ఆక్రమణలను తొలగించాలని పంచాయతీ ఈవో కంది మహేష్‌కు భద్రాద్రి మహిళా వెల్ఫేర్ ఫౌండేషన్ బాధ్యులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం అందజేసిన వారిలో భద్రాద్రి మహిళా వెల్ఫేర్ ఫౌండేషన్ బాధ్యులు కందుల సుజాత, పాలెపు భవానీ, మాధవీలత, గంపల రవికుమారి, పప్పుల జయ, మాధవి, సుమతి, రాణి ఉన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

పినపాక, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలోని ఎల్చిరెడ్డిపల్లి ఏజీహెచ్ఎస్ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 100 మంది 10వ తరగతి విద్యార్థులకు దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్షాప్యాడ్స్, కంపాస్‌బాక్సులు, గ్రాఫ్ పుస్తకాలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్కేటీ గ్రూప్స్ నిర్వాహకులు దోసపాటి నాగేశ్వరరావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పద్మ, వాసవీక్లబ్ సభ్యులు నర్సింహారావు, రమేశ్, సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 5 : మండలానికి చెందిన మక్బూల్ అన్సారీ అనే వ్యక్తి తన ఫోన్‌ను పోగొట్టుకొని మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఫోన్‌ను వెతికి పట్టుకొని సీఐ రమాకాంత్, ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జ్యోతి, సిబ్బంది వెంకట్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి సన్మానం

కరకగూడెం, ఫిబ్రవరి 5 : మండలంలోని సమత్‌భట్టుపల్లి పంచాయతీ వార్డు సభ్యులను, సిబ్బందిని ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ పోలెబోయిన శ్రీవాణి– తిరుపతయ్య దంపతులు సోమవారం పంచాయతీ కార్యాలయంలోసన్మానించారు. ఎంపీడీవో శంకర్, ఎంపీవో శ్రీను, ప్రత్యేక అధికారి మోహన్‌బాబు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ, ఫిబ్రవరి 5: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పాల్వంచ పట్టణ పరిధిలోని కేసీఆర్ నగర్, జ్యోతినగర్, పాత పాల్వంచ, గొల్లగూడెం, సీతారాంపట్నం, కరకవాగు, పేట చెరువు, తెలంగాణ నగర్, రాహుల్‌గాంధీనగర్, ఇందిరాకాలనీల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఏడాదిలోపు అంతర్గత రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, మున్సిపల్ కమిషనర్ స్వామి, తహసీల్దార్ నాగరాజు, సీడీపీవో కనకదుర్గ, మున్సిపల్ డీఈ, ఏఈ, విద్యుత్ ఏఈ, మిషన్ భగీరథ డీఈ, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 5: ఆర్టీసీ కార్మికులకు హామీని నెరవేర్చాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరాంజనేయులు, గడ్డం లింగమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం వారు కొత్తగూడెం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీ కార్మికులపై విపరీతమైన పనిభారాలు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా జిల్లాకు వచ్చిన రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులు బాణాల రాంబాబు, పిట్టల సుధాకర్ పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఇసనపల్లి శామ్యూల్, జాకబ్, వైఎన్ రావు, జాని మియా, కేఎస్ రావు, శివరామకృష్ణ , రాములు, జీఎస్ రెడ్డి, బీఎన్ రావు, నూర్జాన్, రాజ్యలక్ష్మీ, ఫైనాజ్ పర్వీన్ కరుణ, ఎంఎస్ లత, యాకోబు, బీఎన్ కుమార్, సైదులు, సోమయ్య, వీరన్న, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే కారుణ్య నియామకాలు చేపట్టాలి

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 5: సింగరేణిలో అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల వారసులకు ఇస్తున్న కారుణ్య నియామకాలను పాత పద్ధతిలోనే చేపట్టాలని టీబీజీకేఎస్ రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం వీటీసీ ఉత్తర్వుల కోసం రవీంద్రభారతికి ఆహ్వానించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

'ఫిర్యాదుల పెట్టె' పెట్టిస్తాం

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, ఫిబ్రవరి 5 : నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో సమస్యల సేకరణకు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రకటించారు. రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఫిర్యాదుల పెట్టె నిర్వాహణకు ఒక పర్యవేక్షకుడిని సైతం నియమిస్తానని చెప్పారు. పట్టణంలో సోమవారం రాత్రి ఆయన ఆకస్మికంగా పర్యటించారు. క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని ప్రయాణికులతో మాట్లాడారు. బస్టాండ్‌లో కలియ తిరిగారు. మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంక్‌లను తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తంచేశారు. డిపో రీజనల్ మేనేజర్‌కు ఫోన్ చేసి తక్షణమే మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రవేశమార్గంలో దుకాణ నిర్మాణం టెండర్‌ను రద్దు చేయాలని, ఇప్పటికే ఇరుకుగా ఉందని, బస్టాండ్ ప్రాంగణం భూత బంగ్లా వలే ప్రయాణికులకు భయం కలిగిస్తుందని, ఎమ్మెల్యే నిధుల నుంచి సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తానని, బస్టాండ్‌ను సందర్శించి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడ నుంచి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వీధి వ్యాపారులు, రిక్షా కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెత్తను ఒక ప్రాంతంలో నిల్వ చేసి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా బయటకు పంపి పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆయన వెంట ఈవో హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఈవో జూపల్లి ప్రమోద్, నండ్రు రమేశ్, మిండా హరికృష్ణ, కోసూరి అప్పలరాజు, ఆకుల శ్రీను, కోలా లక్ష్మణ్‌రావు, ఉన్నారు.

తలసేమియా బాధితులపై దృష్టిపెట్టండి

దమ్మపేట, ఫిబ్రవరి 5 : తలసేమియా బాధితులపై దృష్టిపెట్టాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వైద్యాధికారులకు సూచించారు. సోమవారం ఎంపీపీ సోయం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన దమ్మపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్మపేట మండలంలోనే సుమారు వందమంది తలసేమియా బాధితులు ఉన్నట్లు తెలిపారు. వారికి తగిన వైద్యసేవలు అందించాలని సూచించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో తుపానుకు నష్టపోయిన 7వేల ఎకరాలకు పరిహారం కోసం నివేదిక పంపినట్లు పేర్కొన్నారు. ఇటీవల పదవీకాలం ముగిసిన సర్పంచులను సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఎంపీటీసీలు, ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ ముజాహిద్ పాల్గొన్నారు.

ఐటీడీఏలో గిరిజన దర్బార్

దరఖాస్తులను స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 5: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ దరఖాస్తులను స్వీకరించారు. తన పరిధిలో ఉన్న ధరఖాస్తులను వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందజేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గిరిజన దర్బార్‌లో ఎక్కువగా భూ, వ్యక్తిగత సమస్యలు, పోడు భూముల పట్టాలకు ఆన్‌లైన్, గ్రామాల్లో త్రీఫేస్ కరెంట్ సౌకర్యం కోసం తదితర సమస్యలపై గిరిజనులు దరఖాస్తులు అందజేశారని పీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఏపీవో పవర్ మునీర్ పాషా, ఎస్‌వో సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మంచు వేళలో విద్యార్థులను బయటకు పంపొద్దు

భద్రాచలం, ఫిబ్రవరి 5: వాతావరణంలో మార్పులతో ఉదయం దట్టంగా మంచుకురుస్తున్నందున ఆశ్రమ, గురుకులాల పాఠశాల పరిసరాల్లో విషపురుగులు సంచరించే అవకాశం ఉన్నందున విద్యార్థులను బయటకు రానివ్వొద్దని ఉపాధ్యాయులను ఐటీడీఏ పీవో సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవో మాట్లాడారు. మంచుకురుస్తున్న సమయంలో పరిసరాలు సరిగా కనపడకుండా ఉంటాయని, ఆ సమయంలో విషపూరితమైన క్రిమి, కీటకాలు సంచరిస్తుండటం వల్ల విద్యార్థులు చూసుకోకుండా వాటి బారిన పడే ప్రమాదముందన్నారు.

గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వీరూనాయక్

భద్రాచలం, ఫిబ్రవరి 5: భద్రాచలం ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వీరూనాయక్‌ను ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సోమవారం నియమించారు. వీరూనాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

రెండోరోజుకు చేరిన నాటకోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 5: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో తాళ్లూరి భారతీదేవి కళా వేదికపై నిర్వహిస్తున్న భద్రాద్రి కళాభారతి నాటకోత్సవాలు సోమవారం రెండోరోజుకు చేరాయి. శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించిన ''కౌసల్యా సుప్రజా రామా'' నాటిక ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఆకెళ్ల శివప్రసాద్ కథను అందించగా నాటకీకరణ స్నిగ్ధ, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి పాటుపడాలి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 5 : రక్షణ సూత్రాలను పాటిస్తూ సమష్టికృషితో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి పాటుపడాలని సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా జీఎం, మల్టీడిపార్టమెంటల్ బృందం కన్వీనర్ దుర్గం రామచందర్ అన్నారు. సోమవారం మణుగూరు ఓసీ, కొండాపురం భూగర్భగనులను సందర్శించి మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. అంకితభావంతో పనిచేసి ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలవాలని, రక్షణ సూత్రాలను తప్పక పాటించాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 5: ప్రజావాణి కార్యక్రమంలో అందించిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, డీఆర్‌వో రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో అనిశాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 5: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దివ్యక్షేత్రంలో సోమవారం బెంగుళూరు భక్తులు రూ.30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను అర్చకులు ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ఇల్లందు రూరల్, ఫిబ్రవరి 5: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకున్నది. సింగరేణి మండలం మాదారం గ్రామ పంచాయతీ పరిధి కొత్తతండాకు చెందిన బోడ విజయ్ (19) సుభాశ్‌నగర్ ఏరియాలోని ఓ షోరూంలో పని చేస్తున్నాడు. బైక్ సర్వీస్‌సింగ్ చేస్తున్న క్రమంలో మోటర్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో విజయ్ సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పారు. ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

అశ్వారావుపేట/ అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 5 : బీఆర్ఎస్ హయాలంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని గుర్రాలచెరువు గ్రామ పాలకవర్గ సభ్యులకు సర్పంచ్ కలపాల దుర్గయ్య సోమవారం సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సర్పంచ్, పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నండ్రు జయ భారతి, ఉప సర్పంచ్ పైడి శ్రీనివాసరావు, అశ్వారావుపేట ఈవో హరికృష్ణ, కార్యదర్శి తేజ, శ్రీరామ మూర్తి, గ్రామ పెద్దలు సత్యనారాయణ, వీరరాజు పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న ఎంపీపీ జల్లిపల్లి

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

పర్ణశాల, ఫిబ్రవరి 5: ట్రాక్టర్ బోల్తా పడి ముష్టి శ్రీను (27) మృతి చెందిన ఘటన సోమవారం ఆంధ్రాలోని కన్నాయిగూడెం గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకున్నది. దుమ్ముగూడెం మండలం సీతానగరం గ్రామానికి చెందిన శ్రీను ట్రాక్టర్‌పై జామాయిల్ కర్రను తీసుకెళ్లి భద్రాచలం వద్ద అన్‌లోడ్ చేశాడు. తిరిగి వస్తుండగా ఆంధ్రాలోని కన్నాయిగూడెం వద్ద ట్రాక్టర్, ముందు చక్రం ఊడిపోయి పల్టీ కొట్టడంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది.

రెండు టిప్పర్లు, జేసీబీ సీజ్

జూలూరుపాడు, ఫిబ్రవరి 5: అనుమతులు లేకుండా అర్ధరాత్రి జరుగుతున్న మట్టి తోలకాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. మండలంలోని పడమటనర్సాపురం సమీపంలోని ప్రభుత్వ భూమిలో సుజాతనగర్ గ్రామానికి చెందిన జేసీబీ మట్టి తవ్వుతోంది. వాటిని టిప్పర్లు పాల్వంచలోని ప్లాట్లకు తరలిస్తున్నాయి. ఈ సమాచారంతో సోమవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. రెండు టిప్పర్లకు రూ.50వేలు, జేసీబీకి రూ.రూ.50 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ శారద తెలిపారు.

కోడి పందెం స్థావరంపై దాడి

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 5: కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని పాల్వంచ రూరల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని బంగ్రిగొండ గ్రామ శివార్లలో కోడి పందేల స్థావపరంపై పాల్వంచ రూరల్ ఎస్సై శ్రీనివాస్ సోమవారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,800 నగదు, కోడిపుంజు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేశారు.

నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలి: జీఎం

రామవరం, ఫిబ్రవరి 5: సింగరేణి ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసి వినియోగదారులకు అందించాలని ఏరియా జీఎం శాలెంరాజు సూచించారు. ఇందుకోసం రక్షణతో పనిచేస్తూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, అదే సమయంలో సమైక్యంగా, సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఏరియాలోని జేవీఆర్‌వోసీలో సోమవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలో జేవీఆర్‌వోసీ అత్యధిక బొగ్గును ఉత్పత్తి చేస్తున్నందుకు మనమూ గర్వపడాలని అన్నారు. డీజీఎం యోహాన్, జేవీఆర్‌వోసీ పీవో వెంకటాచారి, ఏజీఎం ఫైనాన్స్ హనా సుమలత, ప్రాజెక్టు ఇంజినీర్ లక్ష్మణమూర్తి, మేనేజర్ నరసింహారావు, రక్షణాధికారి రాందాస్, సీనియర్ పీవో దేవదాస్, ఇతర ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్చరల్ మీట్

అశ్వాపురం, ఫిబ్రవరి 5 : అశ్వాపురంలోని భారజల కర్మాగారంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు కల్చరల్ మీట్ నిర్వహించనున్నట్లు జనరల్ మేనేజర్ జగ్గారావు తెలిపారు. సోమవారం పర్ణశాల గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అజంతా, ఎల్లోరా, పుష్కర్, నాగార్జున, గోల్కొండ, కోణార్క్, ద్వారకా, రామేశ్వరం జట్లకు చెందిన 180 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలను కలెక్టర్ ప్రియాంక ఆల ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ జీఎం హరీశ్‌కుమార్‌శర్మ, డిప్యూటీ మెయింటినెన్స్ మేనేజర్ వాంగ్మోరే, ఐఆర్‌వో లత పాల్గొన్నారు.

10న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 5: రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా మైదానంలో ఈ నెల 10 నుంచి స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ –2024 నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారని, ఉదయం 11 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. క్రీడాకారులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని, మరింత సమాచారం కోసం 9440116105 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

టేకులపల్లి, ఫిబ్రవరి 5 : మండల స్థాయి కోరం కనకయ్య ప్రీమియర్ లీగ్(కేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ప్రారంభమవుతుంది. ఎమ్మెల్యే కనకయ్య ప్రారంభిస్తారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

పాల్వంచ, ఫిబ్రవరి 5: అయ్యప్పస్వామి ఆలయం మొదటి వార్షిక వేడుకలను ఆలయ ప్రధాన పూజారి మాధవన్ నంబూద్రి, పూజారి బృందావనం నర్సింహమూర్తి నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 5 : మండల మున్నూరుకాపు సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. నాయకులు వన్నం కృష్ణమోహన్, గాండ్ల సురేష్, వలసాల వెంకటరామారావు, గోపిశెట్టి శివయ్య పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

పాల్వంచ, ఫిబ్రవరి 5: కేటీపీఎస్ 5,6 దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి ఇంటర్ ప్రాజెక్టు టీఎస్ జెన్కో హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో హాకీ, బాస్కెట్‌బాల్ క్రీడల్లో కేటీపీఎస్ 5,6 దశలు చాంపియన్‌సిప్‌ను కైవసం చేసుకున్నారు. విజేతలకు 5,6 దశల సీఈ మేకప్రభాకర్‌రావు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసబాబు, సీఈ రామారావు, డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, వీరస్వామి, వైటీఎంకే రాజు, కట్టా శ్రీధర్, రిఫరీలుగా ఇలియాజ్ ఇమామ్ పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రానికి వినతి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5: కొత్తగూడెంలో ఇంటర్ పరీక్ష పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని కోరుతూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సోమవారం అధ్యాపకులు వినతిపత్రం సమర్పించారు. జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ తరపున బండి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతరకు వెళ్తున్నారా..

జర జాగ్రత్త

సారపాక, ఫిబ్రవరి 5 : ఇండ్లకు తాళాలు వేసి కుటుంబమంతా కలిసి జాతరకు వెళ్తున్నారా? అయితే కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలని చెబుతున్నారు పోలీసులు. అప్రమత్తంగా ఉండకపోతే భారీగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సమ్మక్క, సారలమ్మ జాతర ఉన్నందున భక్తులు ఇప్పటికే అధికసంఖ్యలో మేడారం తరలివెళ్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

జాతరకు వెళ్లేవారు వారు పక్కింటి వారికి చెప్పాలి.. లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

సైరన్ మోగే తాళాలు వేసుకుంటే మంచిది.

బెడ్రూంలో లైట్ వేసి ఉంచాలి.

నగలు, నగదు బీరువాల్లో బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి.

సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.

గుర్తుతెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

యాక్షన్ ప్లాన్ సమావేశం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 5: 2024–25 ఆర్థికసంవత్సరానికి మండలంలోని ఆయా పంచాయతీల్లో చేపట్టబోయే పనులకు సంబంధించి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు ఎంపీపీ రేసు లక్ష్మి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన లక్ష్మీనగరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నిధులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ యాక్షన్ ప్లాన్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంఈవో సున్నం సమ్మయ్య, ఎంపీడీవో ముత్యాలరావు, ఎంపీటీసీలు, వైద్యుడు పుల్లారెడ్డి, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అక్రమ కేసులను ఎత్తివేయాలి'

అశ్వారావుపేట, ఫిబ్రవరి 5 : సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సీవై పుల్లయ్యపై అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కంగాల కల్లయ్య ఖమ్మం సీపీని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులను రౌడీషీటర్లుగా సీపీ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. సీపీ సునీల్‌దత్ చర్యలకు నిరసనగా స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్‌లో సోమవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కంగాల వెంకటేశ్, కుర్సం ఏసు, సోయం రాజులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి

చుంచుపల్లి, ఫిబ్రవరి 5: 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ప్రమోషన్లు కల్పించి న్యాయం చేయాలని పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు పీ.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమోషన్లు లేని కారణంగా నాలుగో తరగతి ఉద్యోగులందరూ 20 ఏళ్లుగా ఒకే క్యాడర్‌లో పనిచేస్తుండడంతో కుటుంబాలు గడవడం కూడా కష్టంగా ఉంటోందన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 5: సుజాతనగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

'16న బంద్‌ను జయప్రదం చేయాలి'

జూలూరుపాడు, ఫిబ్రవరి 5: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసమే సమ్మెను చేపట్టినట్లు చెప్పారు. నాయకులు బానోత్ ధర్మా, వెంకటేశ్వర్లు, యాసా నరేశ్, నర్సింహారావు, బాబూరావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 5: ఈ నెల 16న జరిగే కార్మిక సమ్మె గ్రామీణభారత్ బంద్ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పెట్రోల్ బంక్‌లు, ఆటో స్టాండ్‌లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న కార్మికుల వద్దకు వెళ్లి కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన సమ్మె విజయవంతం చేయాలని ప్రచారం చేశారు.

టేకులపల్లి, ఫిబ్రవరి 5 : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొంటున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయంలో సోమవారం నోటీస్ అందజేశారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంఈవో కార్యాలయ సిబ్బందికి సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కడుగుల వీరన్న, ఈసం రాణమ్మ, ఈసం నాగలక్ష్మి, మెట్ల మహేశ్వరి పాల్గొన్నారు.

అడవి జంతువులను వేటాడితే చర్యలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 5: అడవి జంతువులను వేటాడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు స్పష్టం చేశారు. ఫారెస్ట్ ప్రాంతానికి సమీపంలో ఉన్న సూరారం గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి కోసం అడవి జంతువులు అడవిలో నీటి వనరులున్న ప్రాంతాలకు వస్తుంటాయని అన్నారు. అయితే వేటగాళ్లు అక్కడ కాపు కాచి ఉచ్చులు పెట్టి వాటిని వేటాడుతుంటారని అన్నారు. ఇలా జంతువులను వేటాడినా, అడవుల్లో అగ్గిపెట్టేందుకు ఎవరైనా వెళ్లినా, అడవులను నరికి పోడు చేసుకునేందుకు ప్రయత్నించినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

భద్రాచలం, ఫిబ్రవరి 5: పట్టణంలోని టీఎన్జీఓస్ కార్యాలయంలో టీఎన్జీఓస్ అధ్యక్షుడు డెక్కా నర్సింహారావు, అసోసియేట్ అధ్యక్షుడు కటుకూరి నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరనేని రామారావు, చైతన్య భార్గవ్, నాయకులు లింగమూర్తి, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మబ్బు ప్రసాద్, రామారావు, అపర్ణ, అంజిబాబు, క్రాంతి, పుల్లారావు, పాపారావు, పాషా, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.